# వక్ఫ్ బిల్లుపై వాగ్యుద్ధం

- లోక్‌సభలో వాడీవేడి చర్చ
- ముస్లింల మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోం
- ఇది ఆస్తులకు సంబంధించిన బిల్లు మాత్రమే: అమిత్‌షా
- బిల్లు రాజ్యాంగ విరుద్ధం: విపక్షం
- కోర్టులో సవాల్ చేస్తామన్న ముస్లిం పర్సనల్ లా బోర్డు

అమిత్ షా

అఖిలేశ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: వక్ఫ్ (సవరణ) బిల్లుపై బుధవారం లోక్‌సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. బిల్లును రాజ్యాంగ విరుద్ధంగా అభివర్ణించిన విపక్షాలు ముస్లింలను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని ఆరోపించగా, అధికార ఎన్‌డీఏ వక్ఫ్ బిల్లును గట్టిగా సమర్థించుకుంది. ముస్లింల మత వ్యవహారాలలో జోక్యం చేసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. వక్ఫ్ ఆస్తుల విషయంలో పారదర్శకమైన నిర్వహణను తీసుకురావడమే ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ఆయన తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడి యత్నంగా వక్ఫ్ బిల్లును అభివర్ణించారు. మైనారిటీలను అప్రతిష్ట పాల్జేసి సమాజంలో చీలికలు తేవడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన ఆరోపించారు. బిల్లును సభలో ప్రవేశపెట్టిన మైనారిటీల వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు.. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందన్న ప్రతిపక్షాల వాదనను తోసిపుచ్చారు. ఈ బిల్లుకు మతంతో సంబంధం లేదని, ఆస్తుల విషయానికే పరిమితమని ఆయన స్పష్టం చేశారు. ఏ మతపరమైన సంస్థ విషయంలోనూ ప్రభుత్వం జోక్యం చేసుకోబోదని ఆయన వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వం 2013లో వక్ఫ్ చట్టంలో చేసిన మార్పులు ఇతర నిబంధనలపై ప్రభావం చూపాయని, ఈ కారణంగా కొత్త సవరణలు అవసరమయ్యాయని రిజిజు తెలిపారు. వక్ఫ్ బిల్లుకు సంబంధించని అంశాలపై ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. ఈ బిల్లును తీసుకురాకపోతే, కొందరు పార్లమెంట్‌ను కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపాదిత సవరణలు పేద ముస్లింలు, మహిళల సంక్షేమానికి ఉపయోగపడతాయని ఇద్దరు మంత్రులు సభకు హామీ ఇచ్చారు.

**ప్రపంచానికి తప్పుడు సందేశం**

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలలో ప్రతికూల ఫలితాలను చవిచూసిన బీజేపీ పునరేకీకరణ వ్యూహంలో భాగంగా వక్ఫ్ బిల్లును తీసుకువచ్చిందని ఆరోపించారు. లౌకిక దేశంగా పేరుగాంచిన భారత ప్రతిష్టకు ఇది మచ్చలాంటిదని, ప్రపంచానికి తప్పుడు సందేశాన్ని పంపిస్తుందని అఖిలేశ్ అన్నారు. చివర్లో జోక్యం చేసుకున్న అమిత్ షా ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించారు. వక్ఫ్ కౌన్సిల్, బోర్డులలో ముస్లిమేతరులను నియమించడంపై విపక్షాలు చేస్తున్న విమర్శను తోసిపుచ్చారు. బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలను రెచ్చగొట్టవద్దని ఆయన హెచ్చరించారు. ఈ చట్టాన్ని మైనారిటీలు ఆమోదించరంటూ ఓ ప్రతిపక్ష ఎంపీ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఇది భారత ప్రభుత్వం, భారత పార్లమెంట్‌కు చెందిన చట్టమని, దీన్ని ప్రతి ఒక్కరూ ఆమోదించాల్సిందేనని అమిత్ షా స్పష్టం చేశారు.

**బిల్లును ఆమోదిస్తే దేశవ్యాప్తంగా నిరసన: ఏఐఎంపీఎల్‌బీ**

వక్ఫ్(సవరణ) బిల్లును కోర్టులో సవాల్ చేస్తామని, తమ హక్కులకు ప్రమాదకరంగా మారిన నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడతామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్(ఏఐఎంపీఎల్‌బీ) బుధవారం ప్రకటించింది. బుధవారం వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరిగిన నేపథ్యంలో ఏఐఎంపీఎల్‌బీ మీడియా సమావేశంలో తన కార్యాచరణను వెల్లడించింది. ముస్లిం సమాజం ఆస్తులను సీజ్ చేయడానికే ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొస్తున్నదని ఏఐఎంపీఎల్‌బీ అధికార ప్రతినిధి మొహమ్మద్ అదీబ్ ఆరోపించారు. 'మా ఆస్తులను లాక్కోవడానికి వాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఇది ఆమోదయోగ్యమా? మనం ఓడిపోయామని భావించొద్దు' అని ఆయన అన్నారు. ఈ బిల్లును ఉపసంహరించుకొనేంత వరకు పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. ముస్లిం పౌరుల రాజ్యాంగ హక్కులను హరించేలా ప్రతిపాదిత బిల్లు ఉన్నదని ఏఐఎంపీఎల్‌బీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అలీ మోషిన్ అన్నారు. రైతుల తరహాలో దేశ వ్యాప్తంగా వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు చేపడతామని, దీనికి దేశ ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీయడం ద్వారా, ముస్లిమేతరులకు వక్ఫ్ బోర్డుల్లో స్థానం కల్పించడం ద్వారా వక్ఫ్ సొంత మతపర నిధులను, దాతృత్వ నిధులను నిర్వహించుకొనే హక్కును దెబ్బతీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**ఇమ్మిగ్రేషన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం**

దేశంలోకి వలసలు, విదేశీయుల ప్రవేశం, నివాసం.. తదితర అంశాలను నియంత్రించే 'ఇమిగ్రేషన్, ఫారినర్స్ బిల్లు'కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. కొద్ది రోజుల క్రితమే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపగా, తాజాగా రాజ్యసభ ఆమోదముద్ర వేసింది.

# భారత్‌పై సుంకాల మోత?

- అర్ధరాత్రి 1.30 గంటలకు ప్రతీకార సుంకాలను ప్రకటించనున్న ట్రంప్
- అగ్రి, కెమికల్, ఫార్మా రంగాలపై ప్రభావం

వాషింగ్టన్, ఏప్రిల్ 2: మిత్రులు, శత్రువులపై ఒకే రీతిన ప్రతీకార సుంకాలతో దాడి చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంసిద్ధమవుతున్నారు. భారతీయ కాలమానం ప్రకారం గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలపై అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అమెరికాకు ఇది విమోచన దినోత్సవమంటూ ట్రంప్ అభివర్ణిస్తున్న ప్రతీకార సుంకాల ప్రకటన దేశీయ తయారీదారులకు వరం కానుండగా కొన్ని దేశాలకు శిక్షగా మారనున్నది. దశాబ్దాలుగా అమెరికన్ వస్తువులపై దిగుమతి సుంకాలను విధిస్తూ అన్యాయమైన వ్యాపార పద్ధతులకు పాల్పడుతున్న దేశాలపై తాము విధించే ప్రతీకార సుంకాల వల్ల అమెరికన్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ట్రంప్ విశ్వసిస్తున్నారు. అయితే ఈ చర్య అమెరికా ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బతీస్తుందని, అనేక దేశాలతో దశాబ్దాలుగా కొనసాగుతున్న మైత్రీ సంబంధాలను దెబ్బతీస్తుందని రాజకీయ పరిశీలకుల అంచనా. ట్రంప్ ప్రకటన కోసం అనేక దేశాలతోపాటు ఆర్థికవేత్తలు సైతం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

**భారత్‌పై ప్రభావమెంత?**

భారతీయ వస్తువులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించిన పక్షంలో వ్యవసాయ ఉత్పత్తులు, వజ్రాలు, బంగారం, ఆభరణాలు, రసాయనాలు, ఫార్మా, వైద్య పరికరాలు, విద్యుత్తు పరికరాలు, యంత్రాలతోసహా అనేక రంగాలకు చెందిన వస్తువులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా, భారత్ విధించే దిగుమతి సుంకాల రేట్ల మధ్య చాలా ఎడం ఉన్న కారణంగా ట్రంప్ ప్రభుత్వం నుంచి అదనపు కస్టమ్స్ సుంకాలను ఈ రంగాలు ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు తెలిపారు. అమెరికా, భారత్ మధ్య రసాయనాలు, ఫార్మసీ వస్తువుల విషయంలో దిగుమతి సుంకంలో 8.6 శాతం తేడా ఉందని, ప్లాస్టిక్ వస్తువులలో 5.6 శాతం, జౌళి, వస్త్రాలలో 1.4 శాతం, వజ్రాలు, బంగారం, నగలలో 13.3 శాతం, ఇనుము, ఉక్కు, బేస్ ఇతర ఖనిజాలలో 2.5 శాతం, యంత్రాలు, కంప్యూటర్లలో 5.3 శాతం, ఎలక్ట్రానిక్స్‌లో 7.2 శాతం, ఆటోమొబైల్స్, ఆటోమోటివ్ విడిభాగాలలో 23.1 శాతం వ్యత్యాసం ఉందని వారు తెలిపారు.

**భారత్‌కు 310 కోట్ల డాలర్ల నష్టం**

ట్రంప్ విధించే ప్రతీకార సుంకాల కారణంగా అమెరికాకు దిగుమతి అయ్యే భారతీయ వస్తువులపై నికరంగా 310 కోట్ల డాలర్ల(రూ. 26,483 కోట్ల) నష్టం ఏర్పడగలదని ఓ నివేదిక అంచనా వేసింది. ఇది భారత జీడీపీపై 0.1 శాతం ప్రభావం చూపగలదని కేర్‌రిడ్జ్ రేటింగ్స్ డైరెక్టర్ స్మితా రాజ్‌పూర్కర్ అంచనా వేశారు.

**ఆ డర్టీ 15 దేశాలేవి?**

అమెరికా వస్తువులపై విపరీతంగా దిగుమతి సుంకాలను విధిస్తున్న 15 శాతం అమెరికా వ్యాపార భాగస్వామ్య దేశాలను డర్టీ 15గా అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ అభివర్ణించారు. ఈ దేశాల పేర్లను బెస్సెంట్ బహిర్గతం చేయనప్పటికీ అమెరికా వాణిజ్య శాఖకు చెందిన 2024 వాణిజ్య లోటు నివేదిక కొన్ని ఆధారాలను సూచిస్తోంది. ఈ నివేదిక ప్రకారం అమెరికాతో అత్యధిక వస్తు వాణిజ్య లోటు ఉన్న దేశాలలో చైనా, యూరోపియన్ యూనియన్, మెక్సికో, వియత్నాం, ఐస్‌ల్యాండ్, జర్మనీ, తైవాన్, జపాన్, దక్షిణ కొరియా, కెనడా, భారత్, థాయ్‌ల్యాండ్, ఇటలీ, స్విట్జర్లాండ్, మలేషియా, ఇండోనేషియా ఉన్నాయి. ట్రంప్ విధించే ప్రతీకార సుంకాల ప్రభావం ఈ దేశాలపై తీవ్రంగా పడే అవకాశం ఉంది.

**అమెరికాకు రూ.51 లక్షల కోట్ల ఆదాయం**

అధ్యక్షుడు ట్రంప్ విధించనున్న ప్రతీకార సుంకాల వల్ల అమెరికాకు భారీ స్థాయిలో ఆదాయం సమకూరే అవకాశం కనిపిస్తోంది. ఏటా రూ. 51 లక్షల కోట్ల ఆదాయం అమెరికాకు సమకూరవచ్చని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి.

**టారిఫ్‌లపై కంట్రోల్ రూమ్**

ట్రంప్ ప్రతీకార సుంకాలపై చేసే ప్రకటనను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. దీనిలో వాణిజ్య, పరిశ్రమలు, ఇతర మంత్రిత్వ శాఖల అధికారులు ఉంటారు.

## ఐస్‌క్రీములో డిటర్జెంట్ పౌడర్!

**కూల్ డ్రింకుల్లో ఫాస్పరిక్**

**బెంగళూరులో అధికారుల సోదాల్లో గుర్తింపు**

బెంగళూరు: కర్ణాటకలో ఐస్‌క్రీముల్లో డిటర్జెంట్ పౌడర్, కూల్ డ్రింకులో ఫాస్పరిక్ యాసిడ్ వంటి ప్రమాదకర రసాయనిక పదార్థాలను కలుపుతున్నట్టు అధికారుల తనిఖీల్లో బయటపడింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఐస్ క్రీమ్, కూల్ డ్రింక్ తయారీ యూనిట్లపై కర్ణాటక ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మొత్తం 220 దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. 97 దుకాణాలకు నోటీసులు అందచేశారు. ఖర్చును తగ్గించుకోవడానికి స్వచ్ఛమైన పాలకు బదులుగా డిటర్జెంట్, యూరియా, గంజి వంటి పదార్థాలతో తయారు చేసే సింథటిక్ పాలను ఐస్‌క్రీమ్ తయారీలో ఉపయోగిస్తున్నట్టు బయటపడింది.

## అసాధారణ రీతిలో డీజీపీకి డిమోషన్

**చండీగఢ్ డీజీపీ బీఎస్‌ఎఫ్ డీఐజీగా బదిలీ**

న్యూఢిల్లీ: అసాధారణ రీతిలో చండీగఢ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డీజీపీ) సురేంద్ర సింగ్ యాదవ్‌ను డిప్యుటేషన్‌పై సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్) డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ)గా బదిలీ చేస్తూ కేంద్ర హోం శాఖ(ఎంహెచ్‌ఏ) మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఒక ఐపీఎస్ అధికారి ర్యాంకును తగ్గించి బదిలీ చేయడం ఇదే మొదటిసారి. వెంటనే కేంద్రంలో తన కొత్త పోస్టులో చేరాలని యాదవ్‌ను ఎంహెచ్‌ఏ ఆదేశించింది. ఐపీఎస్ అధికారుల పోస్టింగులు, నియామకాలలో కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యాన్ని ఈ చర్య ప్రతిబింబిస్తోంది. అయితే అనూహ్యరీతిలో జరిగిన ఈ బదిలీని ఏప్రిల్ ఫూల్ ప్రాంక్‌గా పలువురు ఐపీఎస్ అధికారులు పొరబడ్డారు. డీజీపీగా పనిచేసిన ఐపీఎస్ అధికారి జూనియర్ స్థాయిలో డీఐజీగా కొత్త బాధ్యతలు చేపట్టడం కన్నా రాజీనామా చేయడమే ఉత్తమమని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## యూపీఐ సేవలకు మళ్లీ అంతరాయం

**వారంలో ఇది రెండోసారి**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలకు బుధవారం అంతరాయం ఏర్పడింది. దీంతో గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌ల యూజర్లు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఫెయిల్డ్ ట్రాన్సాక్షన్స్, యాప్ మాల్‌ఫంక్షన్‌పై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని డౌన్‌డిటెక్టర్ వెల్లడించింది. నిధుల బదిలీ విఫలమైనట్లు 64 శాతం మంది, చెల్లింపు ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు 28 శాతం మంది, యాప్ సంబంధిత లోపాల గురించి 8 శాతం మంది ఫిర్యాదులు చేశారు.

## చొరబాటుకు పాక్ ఆర్మీ యత్నం

**ఐదుగురు హతం**

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద చొరబాటుకు యత్నించిన పాక్ సైన్యం పన్నాగాన్ని భారత ఆర్మీ సమర్థంగా తిప్పి కొట్టింది. అయిదుగురు చొరబాటుదారులను మట్టు బెట్టినట్టు సైన్యం వెల్లడించింది. కృష్ణ ఘాటి ప్రాంతంలో మంగళవారం రోజంతా పాక్ సైనికులు, చొరబాటుదారుల కాల్పులను సమర్థంగా తిప్పికొట్టామని చెప్పింది. పాక్ వైపు మృతుల సంఖ్య మరింత ఎక్కువ ఉండొచ్చని తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లఘించిన పాక్ ఇదే ప్రాంతంలో గత నెలలోనూ ఈ తరహా చొరబాట్లకు, కాల్పులకు పాల్పడిందని సైన్యం తెలిపింది.

## కూలిన జాగ్వార్ యుద్ధ విమానం

**ఓ పైలట్ సురక్షితం, మరొకరు గల్లంతు**

న్యూఢిల్లీ: భారత వాయుసేనకు చెందిన జాగ్వార్ యుద్ధ విమానం బుధవారం గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కుప్పకూలింది. ప్రమాదం నుంచి ఓ పైలట్ సురక్షితంగా బయటపడగా, మరో పైలట్ గల్లంతయ్యారు. ప్రమాదం అనంతరం యుద్ధ విమానంలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లి మంటలను ఆర్పారు. మరో పైలట్ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# కాల్పుల విరమణకు సిద్ధమే

- ప్రభుత్వం శాంతి చర్చలకు పిలవాలి
- పోలీస్ క్యాంప్‌లు ఎత్తేయాలి
- మావోయిస్టు పార్టీ లేఖ విడుదల

భద్రాద్రి కొత్తగూడెం/ సుబేదారి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ), భోపాల్: ఇటీవల దండకారణ్యంతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో భారీగా మావోయిస్టులు మరణిస్తున్న వేళ మావోయిస్టు పార్టీ కీలక ప్రతిపాదన చేసింది. శాంతి చర్చలకు తాము సిద్ధమని తెలిపింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో బుధవారం ఓ లేఖ విడుదలైంది. భద్రతా దళాలు పథకం ప్రకారం తమ పార్టీకి చెందిన పీఎల్‌జీ నిరాయుధ సభ్యులను అమానవీయంగా చిత్ర హింసలకు గురి చేస్తున్నాయని అభయ్ లేఖలో ఆరోపించారు. మహిళా కామ్రేడ్స్‌పై పోలీసులు సామూహిక లైంగిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. 400 మందికిపైగా తమ పార్టీ కార్యకర్తలను, కమాండర్లను, ఆదివాసీలను వారు హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమేనన్నారు. అందుకు సానుకూల వాతావరణాన్ని ప్రభుత్వాలే కల్పించాలని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన హత్యా కాండలను వెంటనే నిలిపివేయాలని ఆయన కేంద్రం, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలను కోరారు. అడవుల్లో సాయుధ బలగాల క్యాంపులను తొలగించి, శాంతి చర్చలకు అంగీకరిస్తే తక్షణమే తాము కాల్పుల విరమణ ప్రకటిస్తామన్నారు. శాంతి చర్చలకు మేధావులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థి నేతలు, పర్యావరణ కార్యకర్తలు సహకరించాలని అభయ్ తన లేఖలో కోరారు.

**మధ్యప్రదేశ్‌లో ఇద్దరు మహిళా నక్సల్స్ ఎన్‌కౌంటర్**

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సీనియర్ మహిళా నక్సలైట్లు మమత, ప్రమీల మరణించినట్టు మధ్యప్రదేశ్ డీజీపీ కైలాశ్ మక్వానా తెలిపారు. వారిపై చెరో రూ.14 లక్షల రివార్డు ఉన్నదని ఆయన తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు ముండిదాదర్–గనేరిదాదర్–పర్సటోలా అటవీ ప్రాంతంలో పోలీసులు బుధవారం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు వారిపైకి కాల్పులు జరిపారు. ప్రతిగా పోలీసులు కాల్పులు తీవ్రం చేయడంతో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు.

## డ్రంకెన్ డ్రైవింగ్‌లో దొరికితే వీసా రద్దు

**అమెరికాలో నిబంధనలు మరింత కఠినతరం**

న్యూఢిల్లీ: ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత ఏదో ఒక వంకతో విదేశీయులను వెనక్కి తిప్పి పంపుతున్నారు అమెరికా అధికారులు. విద్యార్థి లేదా వర్క్ వీసాపై ఉన్న వారు డ్రంకెన్ డ్రైవింగ్‌లో దొరికితే వెంటనే వారి వీసా రద్దు చేస్తున్నారు. తాజాగా మిన్నెసోటా యూనివర్సిటీకి చెందిన ఓ విద్యార్థి వీసాను అధికారులు ఇదే కారణంగా రద్దు చేశారు. ఎఫ్–1 వీసాపై మినియాపొలిస్ బిజినెస్ స్కూల్‌లో చదువుతున్న ఆ విద్యార్థిని ఇమిగ్రేషన్ అధికారులు గత గురువారం అరెస్టు చేశారు. ఇటీవల పాలస్తీనాకు మద్దతుగా ప్రదర్శనలు నిర్వహించిన వారిని సైతం అధికారులు వీసా రద్దుచేసి వారి స్వదేశాలకు పంపించారు. ఇది కూడా అలాంటి అరెస్టేనని భావించిన ఇతర విద్యార్థులు నిరసన ప్రదర్శనలకు దిగారు. అయితే ఇది రాజకీయ సంబంధమైనది కాదని, మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినందుకు వీసాను రద్దు చేశామని అమెరికా హోంశాఖ వివరణ ఇచ్చింది. డ్రంకెన్ డ్రైవింగ్ కేసులో దోషిగా నిర్ధారణ కాకపోయినా, కేవలం అరెస్టయినా సరే వీసా రద్దయ్యే అవకాశం ఉంటుందని, కాబట్టి విద్యార్థులు, వర్క్ వీసాపై వచ్చినవారు జాగ్రత్తగా ఉండాలని న్యాయ నిపుణుడు కేతన్ ముఖీజా సూచించారు. డ్రంకెన్ డ్రైవింగ్ కేసుల్లో ఒకటి కన్నా ఎక్కువ సార్లు దొరికితే శాశ్వత పౌరసత్వం లభించిన వారి వీసాలు సైతం రద్దయ్యే అవకాశం ఉన్నదని మరో ఇమిగ్రేషన్ నిపుణుడు అజయ్‌శర్మ చెప్పారు. పాలస్తీనాకు మద్దతు తెలుపుతూ జరిగిన ప్రదర్శనలలో పాల్గొన్న సుమారు 300 మంది వీసాలు ఇటీవలి కాలంలో రద్దయ్యాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**విద్యార్థులపై ఏఐతో నిఘా**

హమాస్, ఇతర ఉగ్రవాద సంస్థలకు మద్దతిచ్చే విదేశీ విద్యార్థులను గుర్తించేందుకు అమెరికా ప్రభుత్వం కృత్రిమ మేధను (ఏఐ) ఉపయోగిస్తున్నది. విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను ఏఐ సాయంతో తనిఖీ చేస్తున్నది. పాలస్తీనా అనుకూల ఉద్యమాలు, యూదు వ్యతిరేక కార్యకలాపాలపై ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ చేపడుతున్న కఠిన చర్యల్లో భాగంగా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎఫ్1, ఎం1, జే1 వీసాలను రద్దు చేసినట్లు వందలాది మంది విదేశీ విద్యార్థులకు ఈ–మెయిళ్లను పంపించింది. స్వయంగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. మూడు వారాల్లో 300 మంది విద్యార్థుల వీసాలను ఈ విధంగా రద్దు చేసింది.

# పోలీసులూ.. హద్దు మీరొద్దు

- అరెస్టు సమయంలో రూల్స్ పాటించాల్సిందే
- 'ఆర్నేష్ కుమార్' కేసు నిబంధనలు అతిక్రమించరాదు
- రూల్స్ మీరిన పోలీసులపై కఠిన చర్యలు తప్పవు
- ఓ కేసు విషయమై సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు
- పోలీసులు పౌరులకు భరోసా కల్పించాలని హితవు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): నిందితుల అరెస్టు సమయంలో పోలీసుల తీరు, నిబంధనల ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అరెస్టు నిబంధనలను పాటించని పోలీసులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించింది. ఈ మేరకు జస్టిస్ అహ్‌సానుద్దీన్ అమానుల్లాహ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ క్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు (యూటీ) చెందిన డీజీపీలకు హెచ్చరికతో కూడిన ఆదేశాలు జారీ చేసింది.

**ఏమిటీ కేసు?**

ఓ గొడవకు సంబంధించి హర్యానాకు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అయితే, అరెస్టు చేసే సమయంలో 'ఆర్నేష్ కుమార్ వర్సెస్ బీహార్' కేసు నిబంధనలను పోలీసులు ఎంత మాత్రం పాటించలేదంటూ నిందితుడి సోదరుడు ఎస్పీకి మెయిల్ చేశాడు. తమ ఇంట్లోనే కాకుండా పోలీసు స్టేషన్‌లో కూడా తన సోదరుడిపై పోలీసులు దాడులకు పాల్పడినట్టు ఆ మెయిల్‌లో ఆరోపించాడు. మెయిల్ విషయం తెలుసుకొన్న పోలీసులు మరింతగా రెచ్చిపోయారని, తన సోదరుడిపై మళ్లీ దాడి చేశారని సదరు వ్యక్తి ఆరోపించాడు. ఈ క్రమంలో అరెస్టు సమయంలో నిబంధనలను అతిక్రమించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పంజాబ్, హర్యానా హైకోర్టును పిటిషనర్లు ఆశ్రయించగా ఆ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. దీంతో పిటిషనర్లైన సోదరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

- నేరగాళ్లకూ చట్టప్రకారం వారికి కూడా కొన్ని హక్కులు ఉంటాయి.
- క్రిమినల్స్ అయినప్పటికీ వారి గౌరవానికి భంగం కలుగకుండా భౌతికపరమైన రక్షణను కల్పించాల్సిందే.
- ఇక ఈ కేసు విషయంలో పిటిషనర్‌ను ఓ నిందితుడిగా పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఈ క్రమంలో ఓ సామాన్యుడైన పిటిషనర్ కోపాన్ని ప్రదర్శించాడంటే అర్థముంది. అయితే, అన్నీ తెలిసిన పోలీసులు కూడా పరిధి దాటి రెచ్చిపోవడమేంటి? ఇది సరైన చర్య అనిపించుకోదు.
- పౌరుల భద్రతకు, సమాజంలో శాంతి నెలకొల్పడానికి పోలీసులదే కీలక పాత్ర. అయితే, పోలీసులను చూసి సాధారణ పౌరులు భయపడకూడదు. పోలీసులు తమకు భద్రత కల్పిస్తారన్న నమ్మకం, భరోసా పౌరుల్లో కలగాలి.
- ఆర్నేష్ కుమార్ కేసులో పేర్కొన్న తొమ్మిది అంశాల చెక్‌లిస్ట్‌ను ఈ కేసులో పోలీసులు పాటించినట్టు మాకు కనిపించడంలేదు. ఏదో యాంత్రికంగా దాన్ని నింపేసినట్టుగా ఉన్నది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో మళ్లీ పునరావృతం కాకూడదు.
- చెక్‌లిస్ట్ ఆమోదంలో కోర్టులు విచక్షణతో పనిచేయాలి. ఈ విషయంలో హైకోర్టు సరిగ్గా పనిచేసినట్టు కనిపించడంలేదు.
- అరెస్టు సమయంలో పాటించాల్సిన నిబంధనలను పోలీసులు ఇంకా ఆచరణలో పెట్టట్లేదు. 2024లో సోమ్‌నాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర తీర్పులోనూ ఇదే విషయాన్ని మేం గుర్తు చేశాం.
- వ్యక్తుల అరెస్టు సమయంలో నిబంధనల ఉల్లంఘనలు మళ్లీ పునరావృతమైతే మేం ఒప్పుకునేది లేదు.

## మేలో ఐఎస్ఎస్‌కు శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ: అమెరికా ప్రైవేట్ స్పేస్ సంస్థ 'ఏగ్జం' చేపడుతున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 'ఏఎక్స్–4' మిషన్‌కు భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా పైలట్‌గా వ్యవహరించబోతున్నారు. మేలో చేపడుతున్న స్పేస్‌ఎక్స్ డ్రాగన్ రాకెట్ ప్రయోగం ద్వారా భారత్, పోలండ్, హంగేరీకి చెందిన నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపుతున్నారు. ఈ సందర్భంగా శుభాన్షు శుక్లా మాట్లాడుతూ, 'ఇది నా దేశానికి చెందిన 140 కోట్ల మంది ప్రయాణం' అని వ్యాఖ్యానించారు.

## రూ.15 వేల ఉద్యోగికి రూ.33 కోట్ల ఐటీ నోటీసు

అలీగఢ్: నెలకు రూ.15,000 జీతం పొందుతున్న యూపీ వ్యక్తికి రూ.33.88 కోట్లు చెల్లించాలంటూ ఆదాయం పన్ను(ఐటీ) నోటీసు రాగా నెలకు రూ. 8,500 ఆదాయం పొందుతున్న మరో వ్యక్తికి రూ. 3.87 కోట్లకు ఐటీ నోటీసు వచ్చింది. మరో బడుగుజీవికి కూడా రూ.7.79 కోట్ల ఐటీ నోటీసు అందింది. వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించడమే కష్టంగా ఉన్న ఈ ముగ్గురు వ్యక్తులకు మార్చిలో ఐటీ నోటీసులు వచ్చాయి.

# పురుషులకూ గర్భ నిరోధక పిల్!

- టెస్టోస్టిరాన్ హార్మోన్లకు అడ్డుకట్ట
- కుటుంబ నియంత్రణలో విప్లవాత్మక ఆవిష్కరణ
- కొత్త పిల్‌ను అభివృద్ధి చేసిన అమెరికా పరిశోధకులు

న్యూయార్క్, ఏప్రిల్ 2: అమెరికా పరిశోధకులు కుటుంబ నియంత్రణలో విప్లవాత్మకమైన ఆవిష్కరణ చేశారు. పురుషుల్లో ప్రత్యుత్పత్తికి దోహదపడే టెస్టోస్టిరాన్ హార్మోన్లకు అడ్డుకట్ట వేసి గర్భం రాకుండా అరికట్టే సరికొత్త పిల్‌ను అభివృద్ధి చేశారు. ఇది హార్మోన్లలో మార్పులు చేసే సంప్రదాయ గర్భనిరోధక పద్ధతుల లాగా కాకుండా స్పెర్మ్ (వీర్యం) ఉత్పత్తిపై ప్రభావం చూపి గర్భ నిరోధకతగా పని చేస్తుంది. వైసీటీ– 529గా పిలుస్తున్న ఈ పిల్‌ను యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, కొలంబియా యూనివర్సిటీ, యూవర్ ఛాయిస్ థెరప్యూటిక్స్‌ల సంయుక్తాధ్వర్యంలో అభివృద్ధి చేశారు. ఇప్పటికే పురుషులపై మొదటి దశ క్లినికల్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తయినట్టు పరిశోధకులు తెలిపారు. సేఫ్టీ, ప్రభావవంత పనితీరుకు సంబంధించి రెండో దశ క్లినికల్ ట్రయల్స్ త్వరలో జరిగే అవకాశం ఉంది.

**స్పెర్మ్ కౌంట్ తగ్గించి...**

పురుషులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించక ముందు మగ ఎలుకలపై వైసీటీ–529 డ్రగ్‌ను ప్రయోగించగా.. నాలుగు వారాల వ్యవధిలోనే స్పెర్మ్ కౌంట్ భారీగా తగ్గినట్టు, 99 శాతం ప్రభావవంతంగా పని చేసినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, ఈ పిల్ వాడకాన్ని ఆపేసిన ఆరు వారాల్లోగా ఎలుకలు మళ్లీ ఫెర్టిలిటీ సామర్థ్యాన్ని పొందినట్టు పరిశోధకులు గుర్తించారు. క్షీరదాల్లో రెండు వారాల్లోగా స్పెర్మ్ కౌంట్ తగ్గిందని, డ్రగ్ వాడకం ఆపిన 10–15 వారాల్లోగా తిరిగి సామర్థ్యాన్ని పొందినట్టు పరిశోధకులు తెలిపారు. దీని వాడకం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు కూడా లేవని చెప్పారు.

**మహిళలపై భారం తగ్గుదల...**

ఇప్పటివరకు కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధకత అంటే మహిళ బాధ్యత అనే అపోహ సమాజంలో ఉన్నది. అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా అవాంఛనీయ గర్భధారణ రేటు సుమారు 50 శాతం వరకు ఉన్నది. అమెరికాలోని ఎఫ్‌డీఏ 20కి పైగా గర్భ నిరోధక డ్రగ్స్‌కు ఆమోదం తెలిపినప్పటికీ, పురుషులకు మాత్రం కండోమ్, వ్యాసెక్టమీ తప్ప మరో మార్గం లేదు. ఈ నేపథ్యంలో వైసీటీ–529కు ఆమోదం లభిస్తే కొంతమేర అవాంఛనీయ గర్భధారణను అరికట్టే అవకాశం ఉంది. అంతేకాదు, దీని వల్ల మహిళలపై భారం తగ్గే ఆస్కారం ఉంది.

## రష్యాలో కొవిడ్ తరహా మిస్టరీ వైరస్!

- *రోగుల్లో శ్వాసకోశ సమస్యలు, నోటి నుంచి రక్తం*
- *వార్తలను తోసిపుచ్చిన రష్యా వైద్య అధికారులు*

మాస్కో: కొవిడ్ లక్షణాలున్న ఓ మిస్టరీ వైరస్ రష్యాలో కలకలం రేపుతున్నది! దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో శ్వాసకోశ సమస్యలు, దగ్గుతున్నప్పుడు నోటి నుంచి రక్తం కారుతూ పలువురు రోగులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నట్టు ఆ దేశ మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. తీవ్రమైన దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో రోగులు అవస్థపడుతున్నారంటూ కథనాలు పేర్కొన్నాయి. రోగులకు కొవిడ్ టెస్టులు జరపగా.. అందులో నెగెటివ్ రాగా.. దేశంలో మిస్టరీ వైరస్ ఏదో వ్యాపించిందన్న అనుమానాలు బలపడుతున్నాయి. కండరాల బలహీనత, తీవ్ర జ్వరం, దగ్గు.. మొదలైన కొవిడ్ తరహా లక్షణాలతో పలువురు అనారోగ్యం బారినపడటం ఆ దేశ పౌరుల్ని భయాందోళనకు గురిచేస్తున్నది. దీనిపై స్పందించిన రష్యా ప్రభుత్వ వైద్య అధికారులు, మిస్టరీ వైరస్ వార్తల్ని కొట్టివేశారు. కొత్త వ్యాధి కారకాలను గుర్తించలేదని, వెలుగులోకి వస్తున్న శ్వాసకోశ సమస్యలన్నీ సాధారణమైన వేనని స్పష్టం చేశారు. ఫ్లూ లక్షణాలను కలిగిన బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లతోనే పలువురు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాగా, కొవిడ్ నాటి అనుభవాల దృష్ట్యా వైద్య అధికారుల ప్రకటనలను రష్యా పౌరులు నమ్మటం లేదు.

## బెంగళూరులో నీటి చార్జీల పెంపు!

**డీకే శివకుమార్ వెల్లడి**

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ప్రజలపై మరో భారం పడనుంది. బెంగళూరు నీటి సరఫరా, సీవరేజ్ బోర్డు(బీడబ్ల్యూఎస్‌ఎస్‌బీ) నగరంలో మంచినీటి చార్జీని లీటరుకు ఒక పైసా చొప్పున పెంచే అవకాశం ఉందని డిప్యూటీ సీఎం శివకుమార్ బుధవారం వెల్లడించారు. ధరల పెరుగుదలపై బీజేపీ వ్యక్తం చేస్తున్న నిరసనలను ఆయన తప్పుపడుతూ ఇటీవల పాల ధరను పెంచి తమ ప్రభుత్వం రైతులకు ప్రయోజనం చేకూర్చిందని ఆయన తెలిపారు. బీజేపీని రైతు వ్యతిరేకిగా ఆయన అభివర్ణించారు. వివిధ చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టింది.